







ఒంగోలు నగరంలో రేషన్ షాపుల నుంచి బియ్యం మూటలను ఇంటికి మోసుకెళ్లలేక అవస్థపడుతున్న మహిళలు

రేషన్ కష్టాలు మొదలు..!




చీమకుర్తి పట్టణంలోని రెండు రేషన్ షాపుల వద్ద లబ్ధిదారుల పడిగాపులు

- రేషన్ షాపుల్లోనే బియ్యం పంపిణీ ప్రారంభం
- కార్డుదారులకు తిప్పలు
- ప్రజల్లో జగన్ ముద్ర చెరిపేసేందుకు ఎండీయూ వాహనాలను రద్దుచేసిన కూటమి సర్కార్
- ఇంటింటికీ రేషన్ పంపిణీ నిలిచిపోవడంతో రేషన్ షాపుల వద్ద పడిగాపులు



నేలటూరు గ్రామంలో మూసివేసి ఉన్న 12వ నంబర్ రేషన్ దుకాణం



గురవారెడ్డిపాలెంలో సర్వర్ పనిచేయక డీలర్ వద్ద వేచి ఉన్న ప్రజలు

సంతనూతలపాడు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ పథకాలు అందించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తే.. వాటన్నింటినీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు రద్దుచేస్తూ జనాలను ముప్పతిప్పలకు గురిచేస్తున్నారు. అధికారం చేపట్టి ఏడాదైనా.. నేటికీ సంక్షేమ పథకాలేమీ అమలు చేయకపోగా, తాజాగా గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలను రద్దు చేశారు. ఇంటింటికీ రేషన్ పంపిణీని నిలిపివేసి రేషన్ షాపుల్లోనే బియ్యం పంపిణీకి జూన్ 1వ తేదీ నుంచి శ్రీకారం చుట్టారు. దీంతో ప్రజలు వారి పనులన్నీ మానుకుని రేషన్ షాపుల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. కొండవీటి చేంతాడంత క్యూలైన్లు, తోపులాటలు, వాగ్వాదాలు, తీరా తమ వంతు వచ్చేసరికి సర్వర్ మొరాయించడం వంటి సమస్యలతో ఆదివారం మొదటిరోజు రేషన్‌షాపుల వద్ద కార్డుదారులు అవస్థలుపడ్డారు. చేసేదేమీలేక ఉసూరుమంటూ ఇంటిబాట పట్టారు. ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ చౌకదుకాణాల వద్ద ఆదివారం ఇలాంటి పరిస్థితులు అనేకం కనిపించాయి. ప్రతినెలా ఇంటి ముందుకు వచ్చి పేదలకు సరుకులు అందించిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల (ఎండీయూ) వాహనాలను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేయడంతో ఐదేళ్ల క్రితం నాటి దుస్థితి నెలకొంది.

రేషన్ షాపుల వద్ద పడిగాపులు..
ఆపై బియ్యం మూటల బరువులు...

గంటల తరబడి రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాసిన కార్డుదారులు ఎట్టకేలకు బియ్యం తీసుకుని తమ ఇళ్ల వరకూ బరువు మోసుకుంటూ వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు రేషన్ షాపుల వద్ద నిలబడలేక, బియ్యం మూటలు ఇంటివరకూ మోసుకుపోలేక అవస్థపడ్డారు. ఇటీవల వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే బియ్యం, సరుకులు అందుకున్న విషయాన్ని గుర్తుచేసుకుంటూ ప్రస్తుత సీఎం చంద్రబాబు తీరును అసహ్యించుకున్నారు. సంతనూతలపాడు మండలంలో 38 ప్రభుత్వ చౌకధరల దుకాణాలు ఉన్నాయి. పేర్నమిట్టలో మరో 6 దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో అంత్యోదయ అన్నయోజన కార్డులు ఉండగా, అందులో దాదాపు 1700 మంది సభ్యులు ఉన్నారు. తెల్లకార్డులు (డబ్ల్యూఏపీ) దాదాపు 13,780 ఉండగా, బీపీఎల్ కార్డులు 1800 ఉన్నాయి. వాటిలో సుమారు 55 వేల మంది సభ్యులున్నారు. వీరంతా ప్రతినెలా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, చక్కెర, తదితర నిత్యావసర సరుకులు పొందుతున్నారు. ప్రస్తుతం వీరందరూ రేషన్ షాపుల వద్ద వేచి ఉంటూ రోడ్లపై బియ్యం బస్తాలు మోసుకుని వెళ్తూ తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

కిలోమీటర్ల దూరం వెళ్తున్న పలువురు కార్డుదారులు...

కార్డుదారులు పలువురు కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ షాపులకు వెళ్తూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గతంలో ఉండే ఈ పరిస్థితులు మళ్లీ పునరావృతమవుతున్నాయి. కొన్ని పంచాయతీల పరిధిలో ఉన్న పలు గ్రామాల్లో ప్రభుత్వ చౌకధరల దుకాణాలు అందుబాటులో లేవు. వారంతా నిత్యావసర సరుకుల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇలాంటి వారి ఇబ్బందులను గ్రహించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో ప్రజల ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేసేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేశారు. ఈ విధానం దేశంలోని ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచింది. అలాంటి గొప్ప కార్యక్రమాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిలిపివేయడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి.

చీమకుర్తి మండలంలో సర్వర్లు పనిచేయక, సకాలంలో డీలర్లు రాక...



రేషన్ షాపు వద్ద అవస్థపడుతున్న వృద్ధురాలికి సాయం చేస్తున్న మహిళలు



నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం రేషన్ షాపును డీలర్ తెరవకపోవడంతో వేచిఉన్న లబ్ధిదారులు

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంలోని పలు రేషన్ షాపులకు ఆదివారం ఉదయం 8 గంటలకే రేషన్ సరుకుల కోసం కార్డుదారులు వచ్చారు. కానీ, డీలర్లు వచ్చి రేషన్ షాపులు తెరవకపోవడంతో ఎదురు చూపులు చూడాల్సి వచ్చింది. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత గత ప్రభుత్వంలో ఉన్న డీలర్లను కూడా మార్చడంతో కొత్తగా వచ్చిన డీలర్లు షాపులను ఎక్కడ ఏర్పాటు చేశారో తెలుసుకునేందుకు కూడా కార్డుదారులు అవస్థపడ్డారు. రేషన్ దుకాణాల అడ్రస్‌లు కనుక్కోవడం చాలా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల వద్ద నుంచి రేషన్ షాపుల వద్దకు నడుచుకుంటూ రావడానికి పడరాని పాట్లు పడ్డారు. దానికితోడు సర్వర్లు పనిచేయక గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చిందని లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చిన లబ్ధిదారులు గంటల తరబడి బారులుదీరి నిలబడటానికి ఇబ్బందిపడ్డారు. నాగులుప్పలపాడు మండలంలోని తిమ్మసముద్రంలోని ఒక రేషన్ షాపు వద్ద మధ్యాహ్నం 12 గంటల వరకు డీలర్ రాకపోవడం, షాపునకు తాళం వేసి ఉండటంతో వచ్చిన లబ్ధిదారులు షాపు బయటే ఎదురుచూడాల్సి వచ్చింది.

తొలిరోజే రేషన్ దుకాణం మూసివేత...

మద్దిపాడు: మండలంలోని నేలటూరు గ్రామంలో 12వ నంబర్ రేషన్ దుకాణం ఆదివారం ఉదయం 11 గంటల వరకూ మూసివేసే ఉంది. ఒకవైపు ఉదయం 8 గంటల నుంచి లబ్ధిదారులు వచ్చి ఎదురుచూస్తున్నప్పటికీ డీలర్ నిర్లక్ష్యం కారణంగా అవస్థలు తప్పలేదు. సర్వర్ రాకపోవడంతో కొన్నిచోట్ల లబ్ధిదారులు ఇబ్బందిపడ్డారు. రేషన్ దుకాణంలో సరుకుల పంపిణీ ప్రారంభించిన తొలిరోజే షాపు మూసివేయడంపై పలువురు మండిపడ్డారు.



ఒంగోలు నగరంలోని భరత్‌నగర్ చౌకధరల దుకాణం వద్ద క్యూలో వేచి ఉన్న ప్రజలు



ఒంగోలు నగరంలోని సంతపేట చౌకధరల దుకాణం వద్ద సర్వర్ పనిచేయక క్యూలో ఉన్న ప్రజలు

క్లుప్తంగా

రేషన్ పంపిణీ పరిశీలన

ఒంగోలు సబర్బన్: ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకులను ప్రజలకు పంపిణీ చేసేలా చౌక ధరల దుకాణాలను పునః ప్రారంభించినట్లు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (వీసీ అండ్ ఎండీ) మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఆదివారం ఒంగోలులోని సంతపేట, రామ్‌నగర్‌లో ఉన్న రేషన్ దుకాణాలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించి కార్డుదారులకు సరుకుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా సమూన్ మాట్లాడుతూ 65 ఏళ్లు పైబడిన కార్డుదారులు ఉంటే వారికి ఇంటి వద్దే రేషన్ సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బియ్యం, చక్కెరతో పాటు వచ్చే నెల నుంచి రాగులు, జొన్నలు కూడా రేషన్ షాపుల ద్వారా ఇస్తామన్నారు. చౌకధరల దుకాణ వ్యవస్థను పునః ప్రారంభించడం వలన డీలర్లకు భృతి లభిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో వీటిని మినీ మార్టులుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఆ విధంగా కూడా మార్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ జి.సుజాత, ఒంగోలు తహసీల్దార్ పిన్నిక మధుసూదనరావు, ఒంగోలు ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మూగజీవుల సంరక్షణపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న దివ్య, తదితరులు

ఒంగోలు మెట్రో: సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు డీఆర్ఆర్ఎం హైస్కూల్ గ్రౌండ్లో విద్యార్థులకు ఆదివారం మూగజీవాల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మూగజీవాల సంరక్షణ అవగాహన సంస్థ వ్యవస్థాపకులు తాటిపర్తి దివ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డేంపూడి సుజాతరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వీధికుక్కలు, ఇతర మూగజీవాలను సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ ఒంగోలు నగరంలో సంరక్షిస్తున్నట్లు తెలిపారు. వీధి కుక్కలకు ఆహారం, నీరు సక్రమంగా అందుతుంటే అవి మనల్ని ఏమీ చేయవని తెలిపారు. యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధి కోసూరి శ్రీదేవి, మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, చిక్కాల కిరణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా నిలవాలి

ఒంగోలు టౌన్: సమాజంలోని అభాగ్యులను ఆదరించాలని ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ మేడా శ్రీనివాసరావు అన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బొమ్మరిల్లు ఆశ్రమంలో అంతర్జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం, బాలల దినోత్సవం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్, బొమ్మరిల్లు నిర్వాహకులు రాజ్యలక్ష్మి, ఖాశీం పాల్గొన్నారు.

కూటమి కోతలు.. రోడ్లన్నీ గోతులు..!



మట్టి రోడ్డును తలపిస్తున్న తారురోడ్డు



పులికొండ - ఆర్ఎల్ పురం మధ్యలో అధ్వానంగా ఉన్న రోడ్డు



చిన్నరావిపాడు - పులికొండ మధ్య చెరువు కట్టపై గోతులమయంగా రోడ్డు

- రోడ్లన్నింటికీ మరమ్మతులు చేయిస్తామని కోతలు కోసిన సీఎం చంద్రబాబు
- చీమకుర్తి మండలంలోని గ్రామీణ రోడ్లకు కలగని మోక్షం
- అడుగడుగునా గోతులతో నిండిపోయి ప్రయాణికులకు నరకం
- ప్రయాణమంటేనే హడలిపోతున్న మండల ప్రజలు
- వర్షాకాలం ప్రారంభమైతే పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని ఆందోళన



పిడతలపూడి వద్ద గోతులమయంగా ఉన్న తారురోడ్డు

చీమకుర్తి రూరల్: ఈ ఏడాది సంక్రాంతి పండుగ నాటికి చక్కటి రోడ్లంటూ సీఎం చంద్రబాబు గతేడాది చెప్పిన మాటలు చీమకుర్తి మండలంలో నీటిమూటలయ్యాయి. పెద్ద పండుగకు గ్రామాలకు వచ్చేవారికి రెండు నెలల ముందే రోడ్లు బాగుచేయిస్తామని హామీ ఇచ్చారు. కానీ, సంక్రాంతి, మహాశివరాత్రి, ఉగాది వంటి పండుగలన్నీ వచ్చిపోయాయి. మరికొన్ని రోజులు ఆగితే వినాయక చవితితో పాటు దసరా, దీపావళి కూడా వస్తాయి. కానీ, చీమకుర్తి మండలంలో ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రోడ్లన్నీ అడుగడుగునా గుంతలతో నిండిపోయి ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్ల పరిస్థితి ఏమాత్రం మారకపోవడంతో సీఎం చంద్రబాబు వేదికలపై చెప్పే మాటలకు.. వాస్తవాలకు పొంతన లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

చీమకుర్తి మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లు ఇవే...

మండలంలో ప్రధాన గ్రామీణ రోడ్లలో ఒకటైన పిడతలపూడి–బొద్దుకూరపాడు రోడ్డుతో పాటు అనేక ఇతర రోడ్లు గోతులమయంగా ఉన్నాయి. పిడతలపాడు, పుట్టచెరువుపాలెం, చినరావిపాడు, పులికొండ, ఆర్ఎల్ పురం, రామతీర్థం గ్రామాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో అవన్నీ ఛిద్రమైపోయాయి. పిడతలపూడి నుంచి రామతీర్థం వెళ్లే తారురోడ్డు రామచంద్రాపురం, బూసరపల్లి, చినరావిపాడు, పులికొండ, ఆర్ఎల్ పురం, రామతీర్థం వరకు గోతులమయంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై గోతులు ఎక్కువయ్యాయని ప్రయాణికులు, స్థానికులు చెబుతున్నారు. పిడతలపూడి నుంచి రామతీర్థం వరకు పది కిలోమీటర్ల దూరం ప్రయాణించాలంటే అరగంటకుపైగా సమయం పడుతుందని వాపోతున్నారు. ఆయా రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నామని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్ల మరమ్మతులకు సంబంధించి సీఎం మాటలు కోటలు దాటుతున్నా ఆచరణకు నోచుకోకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. స్థానిక పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

సంక్రాంతి పేరుతో మోసం



మూడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే సంక్రాంతి పండుగ పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేశారు. సంక్రాంతికి చక్కటి రోడ్లు వేస్తామని చెప్పారు. సంక్రాంతి పండుగ అయిపోయి ఐదు నెలలు అవుతున్నా రోడ్లపై గోతులు పూడ్చే దిక్కు లేకుండా పోయింది. చంద్రబాబు చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలను నమ్మాల్సిన అవసరం లేదు. మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారు.

– మక్కెన రాజేంద్రకుమార్, సర్పంచ్, పులికొండ

రోడ్లను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



తాము అధికారంలోకి వస్తే గోతులు లేని రోడ్లను తీర్చిదిద్దుతామని అర్భాటంగా ప్రకటనలు గుప్పించిన కూటమి నాయకులు.. గద్దెనెక్కాక ఆ సంగతే మర్చిపోయారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా రహదారుల సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయి. వాహనచోదకులతో పాటు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

– సాదినేని వెంకట్రావు, స్టూడెంట్ విభాగం మండల అధ్యక్షుడు, పులికొండ

తరచూ ప్రమాదాలు



చీమకుర్తి నుంచి కొండపి, కందుకూరు వరకు ప్రతిరోజూ మట్టి, కంకర లోడుతో హెవీ లారీలు ప్రయాణించడం వలన ఈ రోడ్డు దారుణంగా పాడైపోయింది. ఆటోలు, బైకులు ప్రమాదాలకు గురవుతున్నాయి. రోడ్లు బాగుచేయాలని నిరసన వ్యక్తం చేసినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలి.

– సుంకర శ్రీను, వైఎస్సార్ సీపీ మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్, పుట్టచెరువుపాలెం

కౌశిక్ కృషి అభినందనీయం

- మంత్రి డోలా



కౌశిక్‌ను సన్మానిస్తున్న మంత్రి డోలా

ఒంగోలు: బాల్యం నుంచే బలమైన పునాది వేసుకుని సివిల్స్ పరీక్షల్లో అద్భుతమైన ర్యాంకు కైవసం చేసుకున్న అన్ను కౌశిక్ కృషి అభినందనీయమని రాష్ట్ర మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం స్థానిక బృందావన్ ఫంక్షన్ హాలులో కబడ్డీ అసోసియేషన్, పేర్నమిట్ట వాసులు సంయుక్తంగా కౌశిక్‌కు ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారునిగా ఖ్యాతి గడించిన అన్ను వేణుగోపాల్ ఒకవైపు కబడ్డీ క్రీడాకారులకు అద్భుతమైన శిక్షణ ఇవ్వడంతో పాటు మంచి క్రమశిక్షణతో పిల్లలను పెంచి నేడు సమాజం మెచ్చేలా కుమారుడ్ని తీర్చిదిద్దారన్నారు. భవిష్యత్తులో సమాజం మెచ్చేలా సేవలు అందించాలని కౌశిక్‌ను ఆశీర్వదించారు. కౌశిక్ మాట్లాడుతూ తాను ర్యాంకు సాధించేందుకు తన తల్లిదండ్రుల కృషే కారణమన్నారు. తాను భవిష్యత్తులో సమాజంలోని పేద వర్గాలకు చేయూతనిచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తనను ఆశీర్వదించేందుకు పెద్ద ఎత్తున ముందుకు వచ్చిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కౌశిక్‌ను సన్మానించారు. అన్ను వేణుగోపాల్ కుటుంబ సభ్యులను సన్మానించి వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో సంతనూతలపాడు, కందుకూరు ఎమ్మెల్యేలు బీఎన్ విజయ్‌కుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు కుర్రా భాస్కరరావు, పేర్నమిట్ట గ్రామస్తులు పాల్గొన్నారు.

4 నుంచి శ్రీగిరి బ్రహ్మోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, తదితరులు

ఒంగోలు మెట్రో: మరో దివ్య తిరుమలగా పేరొందిన ఒంగోలు కొండమీద ఉన్న శ్రీగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలను ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి తెలిపారు. ఆదివారం శ్రీగిరిలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారితో కలిసి ఝాన్సీరాణి ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడించారు. కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, ఉత్తర పీఠాధిపతి శ్రీ దత్తేశ్వరానంద భారతీస్వామి దివ్య ఆశీసులతో పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం బ్రహ్మోత్సవాలు సంప్రదాయబద్ధంగా జరుగుతాయని తెలిపారు. ఈ నెల నాలుగో తేదీ సాయంత్రం శ్రీగిరిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారన్నారు. విష్వక్సేన పూజ, మేదినీ పూజ, పుణ్యాహవాచనం మృత్సంగ్రహణం, వాస్తు హోమం, ధ్వజదండ, ధ్వజపట గరుడ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించే వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొనదలచిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రేషనలైజేషన్ పాయింట్లలో అవకతవకలు సహించం

ఒంగోలు సిటీ: జిల్లాలోని ఉపాధ్యాయులు రేషనలైజేషన్ పాయింట్లను తప్పుడు సమాచారంతో పొందినట్లు తేలితే సహించబోమని, వారిపై చర్యలు తీసుకుంటామని డీఈఓ ఏ.కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని ఉపాధ్యాయులు ఎవరైనా 8 సంవత్సరాల కన్నా ఎక్కువ సర్వీస్ చేసి అదనపు పాయింట్లు పొందినట్లయితే సంబంధిత అధికారుల చేత సరి చేయించుకోవాలని తెలిపారు.